

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 24 పుష్పం :30 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 6-2-99, సఖినేటిపల్లి)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా!**

హిందూదేశంలోనేకాకుండా యావత్ ప్రపంచంలో కూడా కీర్తి వహించిన గ్రంథము భగవద్గీత. గీతలో చెప్పకుండా ఉన్నవిషయం ఏదిలేదు. సాధకులను, భక్తులను దృష్టిలో పెట్టుకుని చెప్పాడు. మీరు గీతను పఠించడం, ఇతరులచేత పఠింపచేయడం ఈ రెండూ పుణ్యప్రదములని చెపుతారు. అవతారపురుషులలో పూర్ణమైన అవతారము కృష్ణావతారము. గీతను అధ్యయనం చేసి అర్థంచేసుకొని, ఆచరించి మన పూర్వీకులు అనేకమంది తరించారు. గీత యొక్క లోతులు మనకు అర్థం కావటంలేదు. బోధించేవాడు కృష్ణుడంతటివాడై మనకు చెపుతూఉంటే అది మనకు అర్థం అవుతుంది. మన అలవాట్ల వలన గీత మనకు అర్థంకావటంలేదు. మోక్షం పొందటానికి అడ్డదారులు ఏమీలేవు. మోక్షం పొందటానికి దానికి తగిన మూల్యం చెల్లించాలి అని గీతలో చెప్పాడు. బజారుకు 10 రూపాయిలు తీసుకుని వెళ్ళి 100 రూపాయిల వస్తువు కొనాలంటే కుదరదు. 100 రూపాయిలు తీసుకుని వెళితేనే ఆవస్తువు వస్తుంది. అలాగే మోక్షం పొందటానికి తగిన అర్హత సంపాదిస్తే దానిని పొందుతాము. దానికి అడ్డదారులు ఏమీలేవు. మీమనస్సు కుళ్ళిపోకూడదు. మనస్సు ముగ్గాలి. తొందరపడితే కుళ్ళిపోతారు. ముగ్గటానికి కొంతటైము పడుతుంది. ఏకాగ్రత ముఖ్యం. ఏకాగ్రత వస్తే భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను పెద్దవాళ్ళము అయిపోతాము. కాలం కలిసిరావాలి. బహుజన్మల కృషి వలన నీవు పవిత్రుడవు అవ్వాలి. పవిత్రతలేనివానికి బుద్ధిలో ఏకాగ్రతలేని వానికి హృదయంలో ఈశ్వరుడు ఉన్నా నీకు వ్యక్తంకాడు.

నేను అనే మొదటి తలంపును త్యాగంచేస్తేగాని నీకు మోక్షంరాదని భగవాన్ చెప్పారు. నీకు అనేక తలంపులు వస్తున్నాయి. మొదటవచ్చే నేను అనే తలంపే అహంభావన. నీవు ఏ మార్గంలో ప్రయాణంచేసినా, ఏగురువును ఆశ్రయించినా, ఏ శాస్త్రం చదివినా నీవు పోగొట్టుకోవలసింది పోగొట్టుకోకపోతే నీకు మోక్షం రాదు. దీనికి అడ్డదారులు లేవు. నీవుకాని దానిని నీవు అనుకుంటున్నావు. అదే అహంభావన అన్నారు ఆచార్యులవారు. దేహం నేను అనుకుంటున్నావు. మనస్సును నేను అనుకుంటున్నావు. నీవు కాని దానిని నేను అనుకుంటున్నావు. అనాత్మను చూసి ఆత్మ అనుకుంటున్నావు. అసత్యమును సత్యము అనుకుంటున్నావు. నీవు కాని దానియందు నేను అనే బుద్ధి కలగటమే అహంభావన. అది పోగొట్టుకుంటేనేగాని నీవు తరించవు. కర్మనుబట్టి జన్మ వచ్చింది. జన్మను బట్టి కర్మవచ్చింది. ఇదో చక్రం. కర్మ చేస్తే జన్మ వస్తుంది. జన్మ వస్తే కర్మ చేస్తాము. దీనికి అంతులేదు. ఈ కర్మ ఎవరికి? ఈ జన్మ ఎవరికి? అని విచారణ చేసుకుని వివేకంతో దానిని తొలగించుకొంటే నీకు మోక్షం వస్తుంది అని చెప్పారు. దేహాన్ని దాని గతికి విడిచిపెట్టేసి విచారణ చేస్తే నీవు

తరిస్తావు. పొందవలసిన వస్తువును పొందటంకోసం ప్రయత్నంచెయ్యి. కారులో ప్రయాణం చేసేటప్పుడు ఎక్కువగా ఏదైనా అడ్డుగా వస్తూవుంటే ప్రయాణం సరిగా సాగదు. అలాగే నీవు మోక్షం పొందటానికి సాధన చేస్తున్నప్పటికి నీవు పెద్దవాడవు అంటే సంతోషించి, పెద్దవాడవు కాదు అంటే కృంగిపోయి ఇలా చిన్న చిన్న విషయాలను నీ దేహం మీద ఆరోపించకొంటే నీవు చేసే సాధన సరిగా సాగదు. కర్మ వలన వచ్చే ఫలితం మంచిది అయినా, చెడ్డది అయినా అనుభవిస్తేపోతుంది. కర్మఫలం తాత్కాలికం. కాలప్రవాహంలో కొట్టుకొని పోతుంది. ఇవి అన్నీ అనాత్మే. వాటిని విడచి పెట్టు.

నీవు ఈ భూమిని విడచి పెట్టి వెళ్ళిపోతున్నావు అని తెలిసింది. నేనుతరించడంకోసం నీపాదాలను సేవించుకొంటున్నాను. నీకూడా నన్ను కూడా తీసుకునిపో అని ఉద్ధవుడు కృష్ణుని ప్రార్థించాడు. అప్పుడు కృష్ణుడు ఉద్ధవునితో నేను ఈ భూమిమీదకు వచ్చిన పని అయిపోయింది కాబట్టి నేను వెళ్ళిపోతున్నాను. నీ పని ఇంకా అవ్వలేదు. పూర్తి చేసుకొనిరా! అన్నాడు. పూర్తి చేసుకోకుండా వచ్చావనుకో ఆ పని పూర్తి చేయుటానికి మరల ఈ భూమి మీదకి రావలసి ఉంటుంది అన్నాడు కృష్ణుడు. మనస్సు తోటి, మాటతోటి పరమేశ్వరుని తెలుసుకొందామని ప్రయత్నంచేసినా తెలుసుకోలేము. మనస్సు మాట ఎక్కడైతే అణిగిందో అక్కడ పరమేశ్వరుడు వ్యక్తమవుతాడు. నీవు చెవులతో వినే విషయాలు అన్నీ అనాత్మ. నీ కళ్ళతో చూసేదృశ్యాలు అన్నీ అనాత్మ. నీ మనస్సుతో కోరుకొనే కోరికలు ఊహాలు అన్నీ అనాత్మ. ఇవి సత్యం కాదు. ఉద్ధవా సత్యం ఎక్కడోలేదు నీ హృధయంలోనేఉంది. ఎన్ని జన్మలెత్తినా అది నీకు స్ఫురించదు. ఎందుచేతనంటే నీలో అపవిత్రత ఉన్నప్పుడు, కొరత ఉన్నప్పుడు, నీదేహం చుట్టూ కోరికలచుట్టూ తిరుగుతున్నప్పుడు నీ హృదయంలో ఉన్న సత్యంనీకు ఎలా స్ఫురిస్తుంది. నీ మనస్సునకు పవిత్రత కలిగినప్పుడు పవిత్రమైన మానసానికి హృదయంలో ఉన్న వస్తువు స్ఫురిస్తుంది అన్నాడు కృష్ణుడు. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. స్వచ్ఛమైన నీటిలో ఆయన ప్రతిబింబిస్తాడు. కలకలగా ఉన్న నీటిలో ప్రతిబింబించడు. అలాగే నీమనస్సు పవిత్రమైతే నీహృదయంలో ఉన్న ఆత్మ స్ఫురిస్తుంది. ఉద్ధవా! కొంతమంది ధనం సంపాదించుకోవాలని, కొంతమంది కీర్తి సంపాదించుకోవాలని అనుకుంటారు. ఎవరి కర్మను బట్టి, ఎవరి వాసనను బట్టి అది వారు సంపాదించుకోవాలని అనుకుంటున్నారు. నీవు ఆనందాన్ని సంపాదించుకో ఉద్ధవా అన్నాడు కృష్ణుడు. ఆనందం ఎక్కడ ఉంది నీ హృదయంలోనే ఉంది. అక్కడకు వెళితే ఆనందం దొరుకుతుంది. నీ మనస్సు శుద్ధికాకపోతే నీ బుద్ధి శుద్ధి కాకపోతే నీవు ఎంతటివాడవు అయినా నీ హృదయంలో ఉన్న ఆనందం, శాంతి, కాంతి నీకు స్ఫురించదు.

ఆధ్యాత్మిక బోధన చేసేవారిని గురువు అంటారు. కాని గురువంటే కేవలం ఆత్మ జ్ఞానం గురించి బోధించేవాడే గురువుకాదు. తాను ఆత్మానుభవం పొంది దానిగురించి బోధించాలి వాడు గురువు. వాడు పొందకుండా బోధిస్తే అది శ్రవణం చేసినా నిలబడదు. వాడు ఆత్మానుభవం పొంది తాను పొందినది ఇతరులు కూడా పొందటానికి సహాయ సహకారములందించేవాడే గురువు. మబ్బు వలన సూర్యుడు మనకు కనపడడు. అప్పుడు సూర్యుడు లేడని అనుకోవచ్చు. అలాగే నీ మనస్సు కల్పించిన విషయాల వలన సమస్యల వలన ఉన్న వస్తువును ఉన్నట్లుగా చూడలేక పోతున్నాము. ప్రకృతి వైపరీత్యాల వలన వచ్చే

బాధలకంటే కుటుంబ పరంగా వచ్చే బాధలకంటే నీ మనస్సు కల్పించే విషయాల వలన ఎక్కువ బాధపడుతున్నావు. ఏదో గొడవలు కల్పించడం, దుఃఖపడటం మరలా ఆదుఃఖం నుండి విడిపించమని దేవుని ప్రార్థించడం, ఇదంతా నీమనస్సు గొడవే. అది లేకపోతే ఏది లేదు. గురువుని ఈశ్వరుని ప్రార్థించడం ఎందుకంటే నీ మనోచాపల్యం ఆగటం కోసమే. నీమనోచాపల్యం ఆగినప్పుడు వస్తువు స్పష్టంగాను నీకు తెలుస్తుంది. గురుకృప, శాస్త్రకృప, దేవుని కృప లేకుండా మనం తరించలేము. ఇది నాది అనుకోవద్దు. ఇదినాదికాదని అనుకోవద్దు. ఇలాగని అనుకోవద్దు, అలాగని అనుకోవద్దు. భగవంతుడు నీకు ఏపని ఇచ్చాడో ఆపనిని శ్రద్ధగా చెయ్యి. పనిద్వారా తరించడానికి ప్రయత్నించు. సమాజం పట్ల నీవు దయ చూపిస్తే నీ పట్ల భగవంతుడు దయ చూపిస్తాడు.

నీవు ఏపనిని చేసినా కపటంలేకుండా చేస్తుంటే, అది దేవుని పని అని చేస్తూంటే ఈశ్వరుని కృప దానంతట అదే వస్తుంది. నీ కృపకావాలని ప్రత్యేకంగా భగవంతుడిని అడగనక్కర్లేదు. నీవు చేసేపని దయతో అంకితభావంతో చేయాలి. నీవు చేసేపని కపటం లేకుండా చేస్తూఉంటే నీమనస్సును శుద్ధిచేసి పాడుబుద్ధిని తొలగించి సద్బుద్ధిని, సాధు హృదయాన్ని నీకు కలుగచేసి నీకు వస్తువును వ్యక్తం చేస్తాడు. నీ చేతిలో ఉన్నది నీవు శ్రద్ధగా చెయ్యి. వచ్చేది వస్తుంది. రానిది రాదు. బలహీనత నుండి బయటపడాలి అని నీవు నిజంగా ప్రయత్నంచేస్తూ ఉంటే ఈశ్వరుని సహాయం వలన వాటిలో నుండి బయిట పడతావు. భేదబుద్ధి ఉన్నంతకాలం తత్వం తెలియదు. మనం ఇంట్లో పూజ చేసుకొనేటప్పుడు ఎలా చేస్తున్నామో సమాజంపట్ల నీవు చేసేపని అలాగ ఉండాలి. అప్పుడు దేవుని అనుగ్రహానికి పాత్రులవుతాము మనం ఇంట్లో పూజ ఒకరకంగా, బయట పని ఒక రకంగా చేస్తాము. ఆ పని కూడా పూజగా మారిపోవాలి. అప్పుడు నీకు చైతన్యస్థాయి పెరుగుతుంది. సామాజికస్పృహ పెరుగుతుంది. నీకు మోక్షమార్గం కనబడుతుంది. నీకు లోపల ఉన్న ఆనందం అందనంతసేపు బాహ్యమైన సుఖాలమీద ఆధారపడతావు. అందులోనుండి మళ్లించి అవాస్తవమైన సుఖంలోనుండి వాస్తవమైన సుఖంలోనికి నీ మనసును తీసుకునిపోవటానికి బయట గురువు పనిచేస్తూ ఉంటాడు.

మనకు ధనం ఉందని అవసరాలు పెంచుకొంటూ వెళ్లరాదు. అలా వెళితే భోగాలు వస్తాయి. చివరకు ధనం పోతుంది. శరీరం పోతుంది. ఈ భోగాలు వచ్చే జన్మకు వస్తాయి. అప్పుడు నీ దగ్గర ధనం ఉండకపోవచ్చును. భోగవాసన ఉండిపోతుంది. అప్పుడు విపరీతమైన దుఃఖ కలుగుతుంది. భోగాలు ఎదురుగా ఉండాలి కాని వికారం లేకుండా ఉండాలి. అప్పుడు మోక్ష ద్వారం తెరువబడుతుంది అని కాళిదాసు చెప్పాడు. ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని నదులలో మునిగినా నీ మనస్సుకు నిశ్చలత్వం రాకపోతే ఏమిటి ప్రయోజనం? మానవజన్మలో ఉన్నా మనస్సుకు నిశ్చలత్వంలేదు అనుకోండి. జంతు జన్మలో ఉండి మనస్సుకు నిశ్చలత్వం ఉంది అనుకోండి అదే ముందు తరిస్తుంది. భగవంతుని ఆరాధించడంవల్ల నీవు పరిశుద్ధుడవు అవుతావు, నీ కోరిక నెరవేరినా, నెరవేరకపోయినా ఈశ్వరుడిపట్ల భక్తి సమానంగా ఉండాలి. ఈశ్వరుడి పట్ల మనకు ఇష్టం కలిగింది అనుకోండి. ఆ ఇష్టమే మనలను ఆయన పాదాల దగ్గరకు తీసుకుని పోతుంది. ఇష్టం కలగడమే కష్టం. ఈశ్వరుని పట్ల పరిపూర్ణమైన ఇష్టం కలిగితే ఆయన స్వరూపం మనకు వచ్చినట్లే. చేతిలో డబ్బుఉంటే వస్తువును కొనుక్కోవడం

ఎంత తేలికో, ఈశ్వరుపట్ల ఇష్టం కలిగితే ఆయనను పొందటం అంత తేలిక.

రాముడు ఒక్కడే దేవుడు. కృష్ణుడు ఒక్కడే దేవుడు. మీరు ఈమార్గంలో వెళ్తితేనే మోక్షం వస్తుంది. ఇంకో మార్గంలోరాదు. అని చెప్పేవారికి విశాలహృదయంలేదు అని అర్థం. విశాలహృదయం ఉన్నవారు వస్తువు యొక్క తత్వం తెలిసినవారు ఎవరూ ఇలా చెప్పరు. మీరు ప్రమాదంలో పడకుండా ఉండటంకోసం చెబుతున్నాను. నీ పద్ధతిలో నీ మార్గంలో నీవు ప్రయాణం చెయ్యి. ఎవరో చేసారని నీవు చెయ్యవద్దు. అనుకరణవద్దు. నీవు తరించే విధానము చూసుకో. భగవంతుడు అనేక విషయాలు చెబుతూఉంటాడు. నీ బలహీనతలు పోగొట్టుకోవటానికి అందులో ఏ విషయాలు అవసరమో అదిచూసుకో. ఒకచోట నన్నేస్మరించండి అని చెబుతాడు. ఒకచోట ఆత్మను అనుసరించండని చెబుతాడు. ఇలా రకరకాలుగా భగవంతుడు ఎందుకు చెబుతున్నాడు అంటే మనము రకరకాలుగా ఉన్నాము కాబట్టి అందరికీ వీలుగా ఆయన రకరకాలుగా చెబుతున్నాడు. భగవంతుడికి అందరూ కావాలి. అందువలన అందరికీ ఉపయోగపడేలా రకరకాలుగా చెబుతున్నాడు. నన్నే స్మరించండి అని చెపుతున్నాడు. అంటే సాకారబుద్ధి ఉన్నవాడిని విషయచింతనలోనుండి బయటకు తీసుకునిరావటం కోసం చెబుతున్నాడు. నీవు హేతువాదివి అనుకో, సాకారబుద్ధి నీకు లేదు అనుకో ఆత్మని స్మరించుకోమన్నాడు. ఏది చెప్పినా నిన్ను విషయచింతన నుండి బయటకు తీసుకునిరావటానికే చెప్పాడు. కృష్ణుడు అలా చెప్పాడు, ఇలా చెప్పాడు అని అనుకోవటంకంటే అందులో నీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యి. చైతన్యస్థాయిలో మనం అందరం ఒకరకంగాలేము. ఎవరికి నచ్చిన మార్గంలో వారు ప్రయాణం చేయటానికి వీలుగా భగవంతుడు రకరకాల మార్గాలు చెప్పాడు.

మీరు భగవంతుని ప్రార్థించగా, పార్థించగా, నీవు ఏదేవుని ఆరాధిస్తున్నావో ఆయనే గురురూపంలో వచ్చి నీకు సత్యాన్ని బోధించి, స్వేచ్ఛను ప్రసాదిస్తాడు. గురువు వేరు, దేవుడు వేరు కాదు, అయితే ఎందుకు వస్తున్నాడు అంటే నీతో తిరుగుతూ నీతో మాట్లాడుతూ మీలో ఒకడుగా ఉంటూ ఆయన ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితికి మిమ్మల్ని తీసుకుని పోవటానికి చూస్తాడు. వాడు గురువు. నీప్రార్థనా ఫలితంగా ఈశ్వరునికి నీమీద దయ కలుగుతుంది. ఆ దయయే గురురూపం దాల్చుతుంది. దానికి అనుగ్రహించడమే పని. రక్షించడమే పని. లోకంలో అనేక ఆకర్షణలున్నాయి. ఆకర్షణలకులోనుకాకుండా మనస్సుకు శక్తిని, నిర్మలత్వాన్ని, ధైర్యాన్ని ప్రసాదిస్తాడు. గురువు అనుగ్రహం వలన మనస్సు పటిష్టం అవుతుంది. రోగనిరోధక శక్తి ఉంటే రోగం నీ శరీరంలో ప్రవేశించదు. అలాగే నీమనస్సును పటిష్టం చేసి, ఏకాగ్రత చేసి, శుద్ధం చేసినప్పుడు బయట ఆకర్షణలు వచ్చినా నీ మనస్సును ముట్టుకోవు. అది బయట ఆకర్షణలను తట్టుకోవటమే కాదు. లోపలకు లోపలకు అంటే హృదయం యొక్క లోయలలోనికి ఎక్కడైతే సత్యం ఉందో అక్కడకు జారిపోతుంది. నీ మనస్సుకు తెలియకుండా అక్కడకు జారిపోయేలా గురువు చేస్తూ ఉంటాడు. పని జరిగిపోతూ ఉంటుంది. పని తాలుకా బాధ నీకు తెలియదు. గురువు అనుగ్రహం అట్టిది.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL